క్లుప్తంగా

ఎస్ఐకి నాయకుల సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: రాష్ట్రంలో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా నర్సాపూర్ స్టేషన్ ఎంపిక కావడంతో ఎస్ఐ లింగంను పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ నిర్వహణలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌వర్ధన్, ఇతర నాయకులు సుధీర్‌గౌడ్, ప్రసాద్, గోవింద్ తదితరులు ఎస్ఐని పోలీస్ స్టేషన్‌లో అభినందించారు.

బీజేపీ బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): పహల్గాం మృతులకు సంతాప సూచకంగా బీజేపీ కార్యకర్తలు ఆదివారం రామాయంపేటలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు వారు పట్టణంలో ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రైతు ముంగిట శాస్త్రవేత్తలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ. 9 గంటల నుంచి రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అకాల వర్షానికి గుడిసె ధ్వంసం



ధ్వంసమైన గుడిసె గోడ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంద నాగమ్మకు చెందిన పూరి గుడిసె గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో ఆమెతో పాటు ఇద్దరు కుమారులు గుడిసెలోనే నిద్రిస్తున్నారు. గోడ కూలిన శబ్దం రావడంతో ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. దీంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి.

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను లబ్ధిదారులు రఫీ, మోహన్, నవీన్, లక్ష్మి, రాము, బుచ్చమ్మలకు ఎమ్మెల్యే అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

విరాళాల సేకరణ



విరాళాల సేకరిస్తున్న మల్లేష్‌గౌడ్, తదితరులు

నర్సాపూర్ రూరల్: ఈనెల 28న మండలంలోని గొల్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కోసం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గొల్లపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, ఒగ్గు సత్యనారాయణ, మల్లేష్, ఒగ్గు ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పంటలకు రక్ష

మట్టి స్వభావం తెలుసుకునేందుకు మంచి తరుణమిదే..
- అధిక దిగుబడుల సాధించుకునేందుకు అవకాశం
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి సూచనలు



మట్టిని సేకరించే విధానం గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుతున్నారు. సాగుకు ముందు భూసార పరీక్షలు చేసుకుంటే ఖర్చులు తగ్గించడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. భౌతిక, రసాయన, పోషకాల స్థాయి, మట్టి స్వభావం, మట్టి ఏ రకానికి చెందిందో తెలుస్తుంది. దీనిని బట్టి రైతులు పంటలు సాగు చేస్తే వృథా ఖర్చుల నుంచి విముక్తి పొందవచ్చు. భూసార పరీక్షలు చేయించుకోవడంతో పాటు పంటలకు కావాల్సిన ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవచ్చని (కేవీకే) సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి వివరించారు.

మట్టి నమూనాలు సేకరించే విధానం

- ఎకరం పొలంలో 8 నుంచి 10 చోట్ల జిగ్జాగ్ పద్ధతిలో గుర్తులు వేసుకుని 'వీ' ఆకారంలో 15 సెంటీమీటర్లు లేదా అడుగు లోతుగుంత తీసి పై పార నుంచి కింద వరకు మట్టిని సేకరించాలి.
- ఇలా ఎనిమిది చోట్ల తీసిన మట్టిని కుప్పగా పోసి బాగా కలిపి నాలుగు భాగాలుగా విభజించాలి.
- రెండు ఎదురెదురు భాగాలను తీసివేయాలి. ఈవిధంగా అరకిలో మట్టి వచ్చే వరకు చేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వ్యర్థాలు లేకుండా చూసుకుని ఆరబెట్టాలి.
- మట్టి నమూనా సేకరణకు సేంద్రియ, రసాయన ఎరువుల సంచులను వాడవద్దు.
- గట్లవద్ద, పంట కాలువల వద్ద, చెట్లకింద మట్టిని సేకరించవద్దు.
- ఎరువుల కుప్ప వేసిన చోట, ఎప్పుడు నీరు నిలువ ఉండే చోట నుంచి మట్టిని సేకరించవద్దు.
- పొలంలో వాలు ఎక్కువగా ఉన్నప్పుడు దానిని ఎత్తు పల్లపు ప్రాంతాలుగా విభజించి వేరుగా మట్టిని సేకరించాలి.
- పొలంలో అక్కడక్కడ చౌడు ప్రాంతం ఉన్నట్లయితే అక్కడి నుండి మట్టినమూనాలు తీసి వేరుగా చౌడు లక్షణాల పరీక్షకు పంపాలి.

పండ్ల తోటల పెంపకం కోసం

- పండ్ల తోటలకు అనువైన నేలలో గుర్తించడానికి, పోషక పదార్థాలు ఇతర సమస్యలను గుర్తింపు కోసం మట్టి నమూనాలు కింది విధంగా తీసుకోవాలి.
- పంటలను బట్టి మూడు నుంచి ఆరు అడుగుల లోతు మట్టిని తవ్వి ప్రతి అడుగుకు కొంత మటిని సేకరించి పరీక్షలకు పంపాలి.
- పండ్ల తోటల్లో ఎకరాకు రెండు నుంచి నాలుగు చోట్ల మట్టిని సేకరిస్తే మంచిది.
- పరీక్ష కోసం సేకరించిన మట్టిని నీడలో, గాలికి ఆరబెట్టిన తరువాత ప్లాస్టిక్ కవర్లు లేదా బట్ట సంచిలో నింపి భూసార పరీక్షలకు పంపాలి.

నమూనాలతో పాటు పంపాల్సిన వివరాలు

సేకరించిన మట్టిని జిల్లాలోని వ్యవసాయశాఖ లేదా ఇతర భూసార పరీక్ష కేంద్రానికి పరీక్షలకు పంపేటప్పుడు రైతు పేరు, సర్వే నంబర్, గ్రామం, మండలం, జిల్లాతో పాటు ఫోన్ నంబర్ కావాల్సిన పరీక్ష పేరు రాయాలి. ఇంతకు ముందు వేసిన పంట, వాడిన ఎరువులు, వేయబోయే పంటల వివరాలను రాసి మట్టి సంచులలో వేసి పంపాలి. రైతులకు ఇంకా సందేహాలు ఉంటే కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి ఫోన్ నంబర్ 8977868332, 8977868243 నంబర్లలో సంప్రదించాలి.

గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీల సందడి



నూతన కమిటీని సన్మానించిన సిద్దిరామ్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో సాంస్థగతంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నికల ప్రక్రియ జరుగుతోంది. దీంతో గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీల సందడి నెలకొంది. ఆదివారం చిన్నశంకరంపేట మండలం జంగరాయి, ధరిపల్లి గ్రామాల్లో కమిటీలను ఎన్నుకున్నారు. జంగరాయి గ్రామ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లక్ష్మీపతి, రాజు, కోశాధికారిగా ప్రభాకర్, మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ధరిపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట ప్రవీణ్, తడకపల్లి మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా అంజాగౌడ్, బాలేష్, సహాయ కార్యదర్శిగా పెంటారెడ్డి, కిష్టయ్యలతో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ సిద్దిరామ్‌రెడ్డి నూతన కమిటీని అభినందించి సన్మానించారు.

ఆ బోర్డులు.. ప్రమాదాలకు పిలుపులు



ప్రధాన రోడ్డుకు రెండువైపుల ఏర్పాటు చేసిన గ్రామ బోర్డులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ హద్దులు సూచించేందుకు ఏర్పాటు చేసిన బోర్డులు ప్రమాదకరంగా మారాయి. మండల పరిధి కొంతన్‌పల్లి– దంతన్‌పల్లి గ్రామాల హద్దులు సూచించే విధంగా ప్రధాన రోడ్డుపై ఒకే చోట రెండు వైపులా పంచాయతీ సిబ్బంది బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చేటప్పుడు బోర్డులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బోర్డులను సక్రమంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయం గురించి ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా దృష్టికి తీసుకెళ్లగా బోర్డుల మధ్య దూరం ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ భవనం ఉన్నా వృథా..

అద్దె భవనాల్లో సర్కారు కార్యాలయాలు



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం



చెట్లపొదలతో నిండిపోయి వృథాగా ఉన్న లెప్రసీ భవనం

హవేళీఘణాపూర్(మెదక్): నూతనంగా ఏర్పడిన మండలాల్లో హవేళీఘణాపూర్ కూడా ఒకటి. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గతంలో కొనసాగిన లెప్రసీ ఆస్పత్రి భవనం వాడుకునేందుకు వీలుగా ఉంది. డైట్‌లో ఉన్న వసతి గృహం శిథిలావస్థకు చేరింది. కానీ లెప్రసీ భవనాన్ని ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వాడుకునేందుకు అధికారులు ఆ దిశగా ఎందుకు ఆలోచించడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను కార్యాలయాలకు వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా మినీ ఫంక్షన్ హాల్

- రూ.15 లక్షలు నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు



ఆగిపోయిన ఫంక్షన్ హాల్ పనులు

శివ్వంపేట, (నర్సాపూర్): ప్రజల సౌకర్యార్థం నిర్మాణ చేపట్టిన మినీ ఫంక్షన్ హాల్ పనులు నిలిచిపోవడంతో రూ.15 లక్షలు వృథా అయ్యాయి. మండల పరిధి అల్లీపూర్ గ్రామంలో 9 సంవత్సరాల క్రితం మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అప్పటి జెడ్పీ చైర్మన్ రాజమణి రూ. 5 లక్షలు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ.5 లక్షలు, స్థానిక ఎంపీటీసీ మన్సూర్ నిధుల నుంచి 5 లక్షలు మంజూరు చేశారు. రూ.15 లక్షలతో పనులు ప్రారంభించినప్పటికీ నిధులు సరిపోక అసంపూర్తిగా పనులు నిలిచిపోయాయి. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు వివిధ శుభకార్యాలు నిర్వహించుకునేందుకు నిర్మించ తలపెట్టిన ఫంక్షన్‌హాల్ పనులు ఆగిపోవడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పైకప్పు, గోడలు, ఫ్లోరింగ్, ఇతర పనులు పూర్తిచేస్తే వినియోగంలోకి వచ్చే ఆస్కారం ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అసంపూర్తి పనులను మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నల్లపోచమ్మకు ఘనంగా పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకంచేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీశారు. ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేశారు.

ఆలయంలో పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు, మంజీరా నదిలో స్నానమాచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

అండగా ఉంటాం

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బాగున్నగారి రాజ్‌కుమార్ తీవ్ర అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. అతడి స్వగ్రామంలో జరిగిన రాజ్‌కుమార్ అంత్యక్రియలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాజ్‌కుమార్ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఓ మంచి కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని నష్టం జరిగిందని చెప్పారు. ఎమ్మెల్యే వెంటా గ్రామ మాజీ సర్పంచ్ శివకుమార్ ఇతర నాయకులు ఉన్నారు.

నూతన కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో కాంగ్రెస్ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సగల్ల పోలు, ఉపాధ్యక్షుడిగా బోనాల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా సామయ్య, కోశాధికారిగా ఎర్ర రాజు ఎన్నికయ్యారు. సలహాదారులుగా బండమీది రాజు, బాబు,రవీందర్‌గౌడ్ ఎపింకయ్యారు. గ్రామ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో రుద్రాభిషేకం



అభిషేకంలో పాల్గొన్న భక్తులు

హవేళీఘణాపూర్(మెదక్): మాస శివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని ముత్తాయికోట సిద్ధేశ్వరాలయంలో ఉదయం నుంచి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారి గోవింద్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రుద్రాభిషేకం, రుద్ర హోమం, స్వామివారికి అలంకరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్‌పట్టణంతోపాటు మండలంలోని అయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభిషేకంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ



క్రీడాభారతి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆపరేషన్ సిందూర్ విజయానికి శ్రమించిన భారత సైనికులకు మద్దతుగా ఆదివారం క్రీడాభారతి తెలంగాణ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన ర్యాలీలో 250 మంది క్రీడాభారతి సభ్యులు పాల్గొని జాతీయ జెండాలతో నినాదాలు చేశారు. రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారు లు శ్రీనివాస రఘునందన్, శ్రీనివాస్, క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చందాయిపేటలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం బీజేపీ నాయకులు అందించారు. గ్రామానికి చెందిన చాకలి అశోక్‌కు రూ.60 వేలు, కురుమ కొమ్రయ్యకు రూ.15వేలు చెక్కులను ఎంపీ రఘునందన్‌రావు మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శోభన్, శ్రీనివాస్, రమేశ్, బాలేశ్, మధు, అంజనేయులు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పాడి గేదె

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలంలోని కుర్తివాడ శివారులో గ్రామంలోని పుట్టి వెంకటేశంకు చెందిన ఓ పాడిగేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆదివారం గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటేశం వ్యవసాయంతో పాటు, పాడి గేదెల ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పాడి గేదె మృతి చెందడంతో తన జీవనాధారం ఎలా అని వాపోతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పశువైద్యాధికారి రాకేశ్,విద్యుత్ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ నుంచి శేరిపల్లి వరకు బీటీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో కోటి రూపాయాల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మనోజ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలాజీ, భరత్, చిన్నకృష్ణాగౌడ్, బాలకృష్ణాగౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అల్లాదుర్గం(మెదక్): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పెద్దశంకరంపేటలో పూర్వ విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చిల్వెర జిల్లా పరిషత్ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో వారంతా కలుసుకొని సందడి చేశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 25 యేళ్ల అనంతరం కలుసుకున్న వారంతా ఆనాటి మధురస్మృతులను పంచుకున్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పెద్ద శంకరంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1981– 82 సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు రంగారెడ్డి, మనోహర్, సత్తయ్యలను ఘనంగా సన్మానించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 43 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ ఒకచోట సమావేశం కావడంపై ఎంఈఓ వెంకటేశం సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యకుమార్, జ్ఞానేశ్వర్, జనార్దన్, మొగులయ్య, సత్యనారాయణ, సుజాత, జ్యోతి, ఎల్లయ్య, రామ్మోహన్, బాయికాడి రాములు, శ్రీనివాస్‌గౌడ్, విజయకుమార్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.